


# 4

## మధురాంతకం నరేంద్ర

# గాలిపాట

నడిరాత్రి నీరవ నిశ్శబ్దాన్ని కాలింగ్ బెల్ నిలువునా చీల్చింది. తలుపులు తెరుస్తూనే ముందుగా సుడిగాలీ, ఆ వెనకే అతనూ లోపలికి దూసుకొచ్చారు. రంగురంగుల పొడవాటి జుబ్బా కింద నీలిరంగు పాంటు తొడుక్కున్నాడతను. అతడి తలవెంట్రుకలతో బాటూ, పొడవాటి గడ్డం కూడా గాలిలో పాయలు పాయలై యెగురుతోంది. గుండ్రటి కళ్ళజోడు లోపల అతడిచూపులు చుక్కలై వెలుగుతున్నాయి. అతడి భుజానికి వేలాడుతున్న వూదారంగు సంచికి, లోపలున్న వస్తువులేవీ నిర్దిష్టమైన ఆకారాన్ని సంతరించడం లేదు.

"అప్పుడే నిద్రపోయారా బాబాయ్ ! పిన్ని యెక్కడ ? యింట్లో తమ్ముళ్ళున్నారా ? లేకపోతే వుద్యోగాల మాట విని వూరొదిలి పోయారా ?" వచ్చిన వ్యక్తి కుర్చీలో కూచుని తడుముకోకుండా మాటలు మొదలుపెట్టేశాడు.

"గంట యిప్పుడు పన్నెండు దాటింది. అయినా యింట్లో మేమెవరూ నిద్రపోలేదు" అంటూ విసుగ్గా చూశాడు హరనాథ్.

"నిద్ర పోకుంటే యెడారిలా యిల్లింత మౌనంగా వుందెందుకు? గ్రామ్‌ఫోను రికార్డులూ, రేడియోలూ పాతబడిపోయాయనుకో! కనీసం యిడియట్ బాక్సునయినా తెరవలేదా? యింతవొంటరిగా కూచుని యే తపస్సు జేస్తున్నారు మీరంతా?" అని అడుగుతూ, గది తలుపులు తెరుచుకుని వచ్చిన స్త్రీని చూసి "నేను పిన్నీ ! కాళిదాసును. మర్చిపోయావా నన్ను? కొంచెం మంచినీళ్ళయినా యిస్తావా యివ్వవా?" అంటూ పెద్దగా నవ్వసాగాడతను.

"యీవేళప్పుడు యే రైలులో వచ్చావు నువ్వు?" అని వీలయినంత సౌమ్యంగా అడగడానికి ప్రయత్నిస్తూ ఫ్రిజ్‌లోంచీ నీళ్లసీసా బయటికి తీసింది శ్యామల. ఆమె గ్లాసు కోసం వెతుకుతూండగానే, సీసా లాక్కుని, నీళ్ళన్నీ గుటగుటా తాగేసి "యిప్పుడే స్వరమాధురిలో దిగాను" అన్నాడు కాళిదాసు. విస్తుపోయి చూస్తున్న దంపతులకేసి చిలిపిగా చూస్తూ "యీ రైలు ఎప్పుడు యెక్కడ బయలుదేరిందని అడిగితే నేను జవాబు చెప్పలేను. అయితే ఢిల్లీలో అఖిలభారత నాటక సమారోహంలో పదిరోజులు ఆగిందని మాత్రం గుర్తుంది. తర్వాత గ్వాలియర్ హిందూస్థానీ ఘరానాలో నాలుగు దినాలు నిలిచిపోయింది. దారిలో బొంబాయి పంకజ్‌లాల్ ఆర్ట్ గ్యాలరీ చుట్టూ ఆరు రోజులు ప్రదక్షిణాలు చేసింది. పూనా యింటర్నేషనల్ ఫిలింఫెస్టివల్ పిలిచినప్పుడు తప్పదన్నట్టుగా కదిలింది. యింతలో మీ వూరి త్యాగరాజ ఆరాధనోత్సవాలు రావలసిందేనని పట్టుబట్టాయి. యీరోజు వుదయం పంచరత్న కీర్తనలకు టంచనుగా హాజరయ్యింది. తలుపు తెరిచి ఓసారి చూడు పిన్నీ! త్యాగరాజ మండపం దగ్గర పరవళ్ళు తొక్కిన మోహనరాగం మీ యింటి గుమ్మం దాకా కెరటాల్ని విసిరికొట్టింది..." అన్నాడు కాళిదాసు.

హరనాధ్ పెద్దగా నిట్టూర్చి "మీ నాన్నలా గాలికి తిరగడం నీగ్గూడా బాగానే పట్టుబడింది" అని గొణిగాడు.

"మీ అన్నయ్యేమో హరిదాసు. నువ్వేమో హరనాధ్... నేను కాళిదాసు. మీ వారు రంగనాధ్. మీరంతా నాధ్‌లు. మేమంతా దాసులు..." అంటూ కాళిదాసు గలగలా నవ్వసాగాడు.

యింతలో తూర్పువైపున్న గది తలుపులు తెరుచుకున్నాయి. చీకటిలో కళ్ళు తెరుచుకుని వుండటంతో గుడ్లగూబ ముఖంతో వున్న యువకుడొకడూ, అతని వెనకనుంచీ నల్లటి నైటీతో గబ్బిలంలా వున్న యువతీ బిడియంగా తొంగిచూశారు.

"చూశావా పిన్నీ ! మోహనరాగం అల వోకగా ఆ తలుపుల్నీ బాదింది." అన్నాడు కాళిదాసు.

మెల్లగా మాట్లాడమన్నట్టుగా సైగ చేశాక" యిటువైపు గదిలో శ్రీనాధ్ యెల్లుండి జరగబోయే ప్లస్ టూ పరీక్షను మచ్చిక చేస్తున్నాడు. పన్నెండేళ్లుగా వాడు ప్రతి సంవత్సరమూ పరీక్షనొకదాన్ని పట్టుకొచ్చి మేపుతున్నాడు. అయితే యెంత ప్రయత్నించినా అది తొంభైశాతమే అదుపులో కొస్తుంది. చిన్నప్పుడు నేనూ అంతే... తర్వాత పెద్దవాడు రంగనాధ్ గూడా అంతే... యెందుకిలా జరుగుతూందో తెలుసుకుందామని అందరమూ కలిసి యిప్పుడు మోహరించాం. రంగనాధ్, వారి భార్య నిఖితా నగరంలోంచీ ఐటీ వుద్యోగాల దగ్గర అనుమతి తీసుకుని కొత్త కొత్త ఆయుధాలతో వచ్చారు. రంగనాధ్ చేతుల్లోని త్రీయిన్‌వన్ హంటర్ని చూడు. వాడి భార్య చేతుల్లోని ఆల్ యిన్ వన్ జీనుల్ని చూడు. చుట్టూ పద్మవ్యూహాన్ని నిలబెట్టి, మధ్యలో చిన్నవాడ్ని కూచోబెట్టి మేమంతా దళాధిపతులై నిలబడ్డాం. బుద్ధిగా కాస్త తిని, దొంగలా పడుకుని, తెల్లారేసరికల్లా నీ గాలిపాటను తీసుకుని మరో పిచ్చి మజిలీని చేరుకో... తొందరపడి యీ వ్యూహం దగ్గరకొస్తే నీ గతి అభిమన్యుడి గతే !..." అన్నాడు హరనాధ్ గంభీరంగా.

"యీ గాలి పొమ్మంటే పోదు. వుండమంటే వుండదు. మూడు రోజుల కర్ణాటక సంగీత విభావరి విరిసిందీ వూళ్లో.... వుదయం, సాయంత్రం, రాత్రీ మూడు కచేరీలు... అప్పుడప్పుడూ నాట్య ప్రదర్శనలు బోనస్.... యీ వూర్లో కొచ్చి హోటల్లో దిగానని తెలిస్తే నాన్న వూరుకోరు. నువ్వు పొమ్మన్నా నేను యీ మూడురోజులూ యిక్కడే వుంటాను" అన్నాడు కాళిదాసు యీలవేస్తూ.

రంగనాధ్ దంపతులు గోడకు గుడ్‌నైట్ చెప్పి అద్దంలోంచీ జారిపోయే నీడల్లా తలుపుల వెనక మాయమైపోయారు.

రెండు ఆపిల్సు, రెండు అరటిపళ్ళూ, గ్లాసెడు పాలూ తీసి టీపాయ్ పైన పెట్టి "యీ వేళప్పుడు అన్నమేం తింటావ్ ! యివైనా తీసుకో ; అవతలి గదిలో మంచముంది ఫేను వేసుకుని పడుకో..." అని గబగబా సూచనలిచ్చాక నిర్మల చిన్న కొడుకు గదిలోకెళ్లి నిద్రను అవతల తరిమే పని మొదలు పెట్టింది.

హరనాధ్ మళ్ళీ నిట్టూర్చి "అయితే మీనాన్నెక్కడున్నాడో నీకైనా తెలుసునన్నమాట ! యిద్దరికిద్దరే మీరు ! నువ్వు వడగాలి. మీ నాన్న సుడిగాలి." అంటూ సమాధానం కోసం యెదురు చూడకుండా తన గదిలోకెళ్ళిపోయాడు.

కాళిదాసు మంచాన్ని బారెడు వెడల్పున్న బాల్కనీలోకి లాక్కుని, మూరెడు ఆకాశపు తునకను నంజుకుంటూ పళ్ళు తిని, పాలు తాగి, నిద్రలోకి మునకేశాడు. మరునాటి వుదయాన యెత్తయిన యిండ్లపైకెక్కిన యెండ వాడి వాడి చేతుల్తో గుచ్చాక గానీ అతను లేవలేదు.

స్నానాల గదిలోకి దూరి, మంచినీళ్ళతో నిద్రమత్తును కడిగేసుకున్నాక యమన్ కళ్యాణరాగం వేలు పట్టుకుని బయటికొచ్చాడు కాళిదాసు. లాప్‌టాప్‌తో కలిసి యేదో వెతుక్కుంటున్న మరదలితో "ఆలాపన వినాలంటే హిందూస్థానీనే వినాలి నిఖితా! కానీ శుద్ధమైన స్వరగానం కావాలంటే కర్ణాటకే గతి. నిన్నరాత్రి పాల్ఘాట్ సోదరీమణులు ఆనందభైరవినో పట్టు పట్టి చూశారు. వాళ్ళు స్వరపేటికలో నొక్కేకొద్దీ

> **"భైరవ్‌తో కలిసి కచేరీలో మంగళం పాడడం హిందూస్థానీ సంప్రదాయం పిన్నీ! మెహెఫిల్ నుంచి నన్నెప్పుడూ వొంటరిగా రానివ్వదు భైరవ్... యెంత ఆలస్యంగా వచ్చినా అతిథుల్ని ఆదరించడం మన వంశపు ఆచారం గదా! మరేమీ అనుకోకుండా మా యిద్దరికీ వడ్డించు"**

అది పలచనై, చివరకు నూలు పోగంత సన్నగా యేకధారై చిమ్మింది చూడూ...." అంటూ రాత్రి తిన్న సంగీతాన్ని నెమరేయసాగాడు.

లాప్‌టాప్‌తో బాటూ తారట్లాటలో దారి తప్పిపోయిన నిఖిత అనుకోకుండా చేతికి దొరికిన ఆటానాను రెడ్‌హేండెడ్‌గా పట్టుకుంది. పలహారంతో బాటూ రెండు టుమ్రీలు నంజుకున్నాక కాళిదాసు తన నిరాకారపు సంచిని తగిలించుకుని దూరం నుంచీ పిలుస్తున్న మధ్యమావతి ఆధారంతో దారి చేసు కుంటూ వెళ్ళిపోయాడు.

నిఖిత కాస్సేపు తన వునికిని పట్టించుకొని లాప్‌టాప్ నెత్తిపైన టప్పున మొత్తింది. అంతవరకూ దొరకని మేఘమొకటి ప్రేమగా దగ్గరికి రాగానే ఆటానాతో బాటూ దాని పైకెక్కి కూచుంది. అల్లరి చేయబోతున్న ఆటానాను సముదాయిస్తూనే లాప్‌టాప్‌తో చేతులు కలిపింది. పదకొండు గంట లప్పుడు గ్లాసెడు వుత్సాహాన్ని తీసుకొచ్చిన అత్తగారికి బలవంతంగా ఆటానానందించింది. పరాయి బిడ్డను తెచ్చుకుని పనిపాడు చేసుకుంటున్న కోడలిని విసుక్కుంటూ శ్యామల పిల్లదాన్ని చంకనెత్తుకుంది. ఆ సమయంకోసమే యెదురు చూస్తున్నట్టుగా ఆటానా ఆమె చీరను తడిపేసింది. కోపంగా ఆమె దాన్ని నిఖిత వాళ్ళో కుదేసి విసవిసా వంటగదిలో కెళ్ళి పోయింది. యెంతకూ అల్లరి మానని ఆటానాను తీసుకెళ్ళి తన గదిలో పెట్టి తాళం తగిలించింది నిఖిత. మధ్యలో అప్పుడప్పుడూ చంటిపిల్ల గుర్తు కొస్తున్నా, లాప్‌టాప్‌తో అయిష్టంగానే కాలం తోసింది ఆమె. మధ్యాహ్నం భోజనాలయ్యాక, యెవరూ చూడని సమయంలో కాస్సేపు ఆటానాతో ఆడుకుని, మళ్ళీ దాన్ని గదిలోనే బంధించింది.

రెండు గంటల తర్వాత యింటికొచ్చిన కాళిదాసుతో "యీ పూట యే రాగంతో కడుపు నింపుకున్నావో! యిప్పుడు భుక్తాయాసం తీర్చుకో" అంది శ్యామల వెక్కసంగా.

కాళిదాసు నిరాకారపు సంచితో బాటూ కుర్చీలో కూచుని "దొరికిందని ఆబగా తినేస్తే యేదైనా మందగిస్తుంది పిన్నీ! మళ్ళీ సాయంత్రం విందుకెళ్ళి నప్పుడు నా యిష్టమైనవి దొరికినా తినే వీలుండదు. యీలోగా తిన్నది జీర్ణం కావాలి. నువ్వు వడ్డించ బోయే అన్నమే దానికి ఔషధం" అన్నాడు. మూడు గంటలనుంచీ అయిదు వరకూ ఫేను కింద నిద్రని ఆరేశాక, సాయంత్రం విందుకు తరలిపోయాడతను.

రాత్రి వొంటి గంటకు మళ్ళీకాలింగ్‌బెల్ మోగింది. తనతో బాటూ భుజంపైన చేయి వేసుకుని తీసుకొచ్చిన పిల్లవాడ్ని చూపెడుతూ "భైరవ్‌తో కలిసి కచేరీలో మంగళం పాడడం హిందూస్థానీ సంప్ర దాయం పిన్నీ! మెహ్‌ఫిల్ నుంచీ నన్నెప్పుడూ వొంటరిగా రానివ్వడీ భైరవ్... యెంత ఆలస్యంగా వచ్చినా అతిథుల్ని ఆదరించడం మన వంశపు ఆచారం గదా! మరేమీ అనుకోకుండా మా యిద్దరికీ వడ్డించు" అన్నాడు కాళిదాసు.

శ్యామల డైనింగ్ టేబుల్ పైన రెండు తట్టలు ధబేలుమని శబ్దమొచ్చేలా పెట్టి "మిగిలిందదే.. యిద్దరూ సర్దుకోండి" అంటూ వోచిన్న గిన్నెను ముందుకు తోసింది.

"కావాలంటే నా భాగం గూడా అతిథికే పెట్టు పిన్నీ... అతడి కడుపు నిండితే నా కడుపు నిండినట్టే...." అన్నాడు కాళిదాసు.

"అది నీ యిష్టం...శ్రీనాథ్ గదిలో యిప్పుడు మీ బాబాయ్ డ్యూటీ చేస్తున్నాడు. నా వంతు తెల్లవారు తూనే... అందాకా కాస్త కునుకు తీయాలి..." అంది శ్యామల.

"ఆగాగు పిన్నీ..." అంటూ కంగారుగా పిలిచాడు కాళిదాసు. "మనింట్లో యెంగిలి పద్దాక మనకేదైనా యివ్వకపోతే యీ భైరవ్‌కు తృప్తి వుండదు. పోతే పోనీ, నీ గదికి తీసుకెళ్ళు. కనీసం నీకు నిద్ర వచ్చేదాకా జోకొడతాడు...." అయిష్టంగా చూస్తూ గదిలో కెళ్ళిన శ్యామలను చూస్తూ భైరవ్‌తో "మా పిన్ని నిద్రపోగానే నువ్వు నా గదికొచ్చి నిద్ర పుచ్చాలి. నువ్వొచ్చేదాకా నేను మేలుకునే వుంటాను" అన్నాడు కాళిదాసు.

మంచాన్ని బాల్కనీలోకి లాక్కుని మిగిలిన ఆకాశ శకలాన్ని తిని కడుపు నింపుకోడానికి ప్రయత్నించాడు కాళిదాసు. యెంతకూ భైరవ్ తన గదికి రాకపోయే సరికి గదిలోకి తిరిగొచ్చి దీపం వెలిగించుకున్నాడు.

వుదయం తొమ్మిది గంటలప్పుడు రంగనాథ్ తన లాప్‌టాప్ కోసం వెతుక్కోసాగాడు. చివరకు కాళిదాసు మంచం పక్కన జాగారం చేస్తూ కనిపించిం దది. మండిపడుతూ దాని చెవి మెలేశాడు అతను. అది సరికొత్త ఫైళ్ళను సంతరించుకున్న ఆనందంతో తుళ్ళింతలాడింది. రంగనాథ్ మందలిస్తున్నా విన కుండా పెద్దగా అరవసాగింది" రాత్రంతా ఆకాశపు కొలనులో నక్షత్రాలు యీదుతున్నాయి.... వొంటరి తనంతో చెయ్యి కలిపి పిల్లగాలి వద్దన్నా నాట్యం చేస్తోంది... నిన్న ఆతిథ్యమిచ్చిన స్వరాలు నేడూ వుండిపొమ్మంటున్నాయి.... రేపు వస్తామన్న రాచిలుకలు యివ్వాళే వచ్చేశాయి... కనురెప్పలవెనక చేరి కవ్వింతలై వెలిగాయి... గుండె గుడారంలోకి వొంటెల్లా చేరి వేళ్ళ కొసల్ని వ్యక్తీకరించాయి.... వేళ్లు తగిలిన కొమ్మలంతా చెమరింతల్ని పూసాయి.."

"భైరవ్ రాత్రంతా పిన్ని గదిలో వుండి పోయాడు. నాకు నిద్రే పట్టలేదు. నేను వొంటరిగా మేల్కొన్నానని, పాపం నీ లాప్‌టాప్ తల్లడిల్లి పోయింది. రాత్రంతా నన్ను ఆడించింది" అన్నాడు కాళిదాసు నిద్రలేచి ఆవులిస్తూ. కాస్సేపటి తర్వాత "నా అల్లరిని తట్టుకోలేక కాగితాలు అలిసిపోయేవి. కానీ లాప్‌టాప్‌కు అలసటే రాలేదు. కావాలంటే ఆటంతా చెరిపేసి కొత్త ఆటకు సై అంటుంది.



గుంటూరులో 13-3-08న అరసం ఆధ్వర్యంలో డా॥ పరుచూరి రాజారాంకు సాహితీ సత్కారాన్ని డా॥ మధురాంతకం నరేంద్రకు ప్రదానం చేస్తున్న పరుచూరి అజిత, వేదికపై డా॥పాపినేని శివశంకర్ (కవి, విమర్శకులు), వల్లూరు శివప్రసాద్ కథానాటక రచయిత ఉన్నారు.

నాకూ యిలాంటిదొకటుంటే అప్పు డప్పుడూ నాదైన ఆట ఆడుకుంటాను గదా అనిపిస్తోంది..." అన్నాడు.

"యిది గాలికి పుట్టి గాలికి పెరిగే పిల్లల్లాంటిది కాదు. యిది కావాలంటే నువ్వు నాలాగా కష్టాల తోనూ ఆడాలి... " అంటూ రంగనాథ్ కసిరాడు.

చన్నీళ్ళతో నిద్రలేమిని చల్లా ర్చాక, బడలికకు ఆహారపు ఔషధాన్ని పెట్టాక, భైరవ్ కోసం మళ్ళీ యిల్లంతా వెదికాడు కాళిదాసు. చివరకు విసిగి పోయి కేదాల్ రాగాన్ని పిలిపించుకుని, తోడు బెట్టుకుని వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం లాప్‌టాప్ పక్కన కూచున్న భర్త దగ్గరికొచ్చిన నిఖిత "యింట్లో యిద్దరు పిల్లలు ఎవరికీ తెలియకుండా ఆడుకోవడం చూశారా మీరు?" అని ప్రశ్నించింది. రంగనాథ్ పరధ్యానంగా యెటో చూస్తూ "యీ అల్లరి పిల్లాడు యింతగారం చేయాలా నన్ను మురిపించడానికి.... నా లోపల యిన్ని రాగాలు ఆడాలా నువ్వొచ్చి వాలడానికి..." అన్నాడు.


భర్తమాటలు అర్థంగాకపోయినా "లాప్‌టాప్ లోంచీ వచ్చి మీ భుజంపైన వాలిన యీ బుల్లిపిట్ట యెంత బాగుందో..." అని మురిసిపోయింది నిఖిత. అంతలో వులిక్కిపడి "యిదేం పిచ్చి మనకు... వుదయమంతా శ్రీనాథ్‌ను భౌతికశాస్త్రంలోకి తోలాను. యిక మీరెళ్ళి లెక్కల్లోకి తరమండి" అంది.

వొంటి గంటన్నరకు నడిరాత్రి తలుపుల్ని బాదుతుండగా ధిగ్గున లేచింది శ్యామల.

"కోప్పడకు పిన్నీ... యీ సత్యభామ వొకరి మాట వినేది గాదు. భామాకలాపం ముగిసినా శ్రీకృష్ణుడ్ని వెతకడం మానదు. యెంత చెప్పినా వినకుండా మన యింట్లో వున్నాడేమోనని వెంటే వచ్చింది. అయినా యేమాటకామాటే చెప్పుకోవాలి. యీవిడగారికి అలిగే కొద్దీ అందం పెరిగిపోతోంది. అందుకేనేమో, పాపం, ఆ శ్రీకృష్ణుడు యీ భార్యంటే పడి చస్తాడు..."

శ్రీకృష్ణుడి పేరెత్తగానే యింట్లోని దేవుడిగది జ్ఞాపకం రావడంతో శ్యామల భయంతో చెంపలేసు కుంటూ వుండిపోయింది.

"యీవిడ స్నేహితురాలొకతి పారిస్లో వుంది. యింకో స్నేహితురాలు రాజస్థాన్‌లో వుంది. వీళ్ళందరికీ పెద్దన్నొకడు కేరళలో వుంటాడు. అతగాడు మీసం దువ్వుకుని, జూలు దులుపుకుని రంగంలోకి దూకాడే అనుకో, యిక మన బతుకంతా కథాకళే !...." తింటున్నప్పుడు కూడా కాళిదాసు చెబుతూనే వున్నాడు.




తన గదిలోకెళ్ళి తలుపులు మూసుకున్నాక కూడా బాల్కనీలో సత్యభామ కాళిదాసుకు భర్తపైన చెబుతున్న చాడీలే వినబడసాగాయి శ్యామలకు. యెప్పుడో ఆదమరచి నిద్రపోయి, తరువాత అలారం గడియారం కూతకు మేలుకుంది. అప్పటికీ బాల్కనీలో దీపం వెలుగుతూనే వుంది. పగటి వెలుతురు పరుచుకున్న తర్వాత దీపం వెలుతురు పాలి పోయింది. అనవసరంగా వెలుగుతున్న దీపాన్ని ఆర్పుదామని బాల్కనీలోకొచ్చిన హరనాథ్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అతను శ్రీనాథ్ కోసం తెచ్చిన తెల్ల కాగితాలూ, భార్యకోసం తెచ్చిన రవిక గుడ్డలూ, రంగనాథ్ కట్టబోతున్న యింటికోసం తీసుకొచ్చిన టైల్సుముక్కలూ హోలీ ఆడుకుంటున్నాయి.

"రాత్రి యీ సత్యభామ యెంత చెప్పినా వినకుండా తన స్నేహితురాళ్ళనూ, బంధువులనూ పిలిచి శ్రీ కృష్ణుడితో మద్దిన్నం పెట్టింది. వాళ్ళందర్నీ శాంతింపజేయడానికి పండగ చేయక తప్పలేదు.... నువ్వు తీసుకొచ్చిన వాళ్ళందరూ యిప్పుడు యెంత ఆనందంగా పురకలేస్తున్నారో చూశావా బాబాయ్..." అన్నాడు కాళిదాసు మంచంపైన లేచి కూచుని.

"మా యింట్లో వుండే రంగులు రెండే - తెలుపూ, నలుపూ... రాత్రికి రాత్రి యిన్ని రంగుల్నెలా తెచ్చావురా నువ్వు?'' అని ఆశ్చర్యపోయాడు హరనాథ్.

"భలే వాడివిలే బాబాయ్ నువ్వు ! యీ రంగులన్నీ యీ యింటి చుట్టూ దొరికినవే.. అటు ఆకాశం కేసి చూడు - నీలిరంగు. బాల్కనీలోని వాలుతున్న కొమ్మల్ని చూడు - ఆకుపచ్చ. కొమ్మల మధ్యలో చూడు... మొగ్గలూ పువ్వుల యెరుపు రంగు... తెల్లవారుజామున ఆకాశంలోకి చూశావా బాబాయ్ నువ్వెప్పుడైనా ? అక్కడ ప్రతిరోజూ హోలీనే... ఆ రంగులన్నింటినీ రమ్మని యెంత ప్రాధేయపడ్డానని... కానీ కొన్నే వచ్చాయి. చూస్తూ వుండు. అన్నింటినీ తీసుకొచ్చేరోజు దూరంలో లేదు..." కాళిదాసు యేదో వుద్రేకంలో వున్నట్టున్నాడు.

"బాగానే వుందిలే... ఆ రంగులు నీ చేతుల్నీ, బట్టలనీ వొదలడం లేదు చూడు... వాటినంతా స్నానాల గదిలోకి తరుము...'' అని మందలించాడు హరనాథ్.

"యిది భలేగడసరిది బాబాయ్.. కొన్ని రమ్మన్నా రావు. మరికొన్ని పొమ్మన్నా పోవు...." అని ప్రేమగా నిమురుతూ పైకి లేచాడు కాళిదాసు.

పలహారం వడ్డిస్తూ శ్యామల మర్యాదకు అనక తప్పదన్నట్లుగా "శ్రీ కృష్ణుడు మా యింట్లో లేడని తెలిశాక మీ సత్యభామ మా యింట్లో ఆగదేమో!...." అంది.

"ఆ సంగతి ప్రత్యేకంగా చెప్పాలా పిన్నీ... చూడు ఆవిడెంత విసవిసా నడుస్తోందో ! మళ్ళీ యెప్పుడైనా తీసుకొస్తాలే..." అంటూ కాళిదాసు సత్యభామ వెనకే పరిగెత్తాడు.

ఆటానాతో వేగలేక కాళిదాసు కప్పగించేయ డం కోసం మధ్యాహ్నం చాలాసేపటివరకూ యెదురు చూసింది నిఖిత. కానీ అతగాడు రాత్రి రెండు గంటలకు గానీ తిరిగి రాలేదు.

"శ్రీనాథ్‌కు రేపే యుద్ధం, గదిలో వాడు పరీక్షను బుజ్జగిస్తున్నాడు. వాడి దగ్గరికి రానివ్వకుండా నిద్రను అటకాయిస్తూ మేమంతా కాపు గాస్తున్నాం. నువ్వు అల్లరి చేయకుండా బాల్కనీలోకెళ్ళు..." అని గుసగుసగా చెప్పాడు హరనాథ్.

కుర్చీలో కూచున్నాక "కాపుగాయడమంటే యిదేనా బాబాయ్ ! అటు చూడు, పిన్ని తూలు తోంది. రంగనాథ్ జోగుతున్నాడు. పాపం, నిఖిత కునికేసింది. వోసారి త్యాగరాజ మండపం దగ్గరి కొచ్చి యవనిక దగ్గర నేర్చుకోవాలి మీరందరూ ! తెల్లవారినా అది కంటిపైన రెప్పేయదు... అయితే దానితోబాటూ నిలదొక్కుకోగల్గిన వాళ్ళెందరని మాత్రం నన్ను అడగద్దు... గంగిగోవుపాలు యెంత కావాలి చెప్పు?" అన్నాడు కాళిదాసు.

పెద్దగా ఆవులించాక "అంతశక్తి దానికెలా వచ్చిందిరా?" అని అడిగాడు హరనాథ్.

"అదే బాబాయ్ గమ్మత్తు. అక్కడ రంగులూ రాగాలు కలిసి నాట్యం చేస్తాయి. ఆలోచనా అనుభూతీ కలిసి చర్చలు జరుపుతాయి. గతమూ వర్తమానమూ కలిసి భవిష్యత్తును సేద తీరుస్తాయి. యింతకూ యీ రోజు అక్కడ కలిసినవాడు కొత్త వాడేమీ గాదు.కానీ వాడు రంగంపైకిరాగానే అర్జునుడై పోయాడు. "అదిగో ద్వారక... ఆలమందలివిగో" అంటూ వాడు ఆలపించగానే ద్వారకకు ద్వారకే

మా ముందుకొచ్చేసింది. యిక దుర్యోధనుడూ, శ్రీ కృష్ణుడూ, ధర్మరాజూ, ద్రౌపదీ మొత్తం కురువంశ మంతా తల్లి వెనక పరిగెత్తుకొచ్చే పిల్లకూనల్లా నడుచు కొచ్చేసారంటే నమ్ము !"

హరనాథ్ నోరు నొప్పెట్టేలా అవులించాక "అది ద్వారక.. ఆలమందలవిగో.." అని కీచు గొంతు కతో పాడబోయాడు. నిఖిత వులిక్కిపడి కళ్ళు తెరిచి "ఆటానా మళ్ళీ నిద్రలేచిందా?" అని కంగారుపడింది. శ్యామల తల విదిలించుకుంటూ ముందుకు వంగి "మళ్ళీ సత్యభామను తీసుకొచ్చావా?" అని గీ పెట్టింది. రంగనాథ్ బద్ధకంగా నీల్గి "యెన్ని చేతనలను తరమ గొట్టాక వొక్క సృజన పలకరించింది?"అని గొణిగాడు.

అనుకోకుండా తలతిప్పిన హరనాథ్ "నువ్వెప్పుడొచ్చావురా శ్రీనాథ్? పరీక్షనక్కడ వదిలి పెట్టి యిక్కడేం చేస్తున్నావు?" అని గొల్లుమన్నాడు.

చేజారుతున్న 'ఆల్ యిన్‌వన్' గట్టిగా పట్టుకుంటూ శ్రీనాథ్ గదిలోకి పరిగెత్తాడు.

"నువ్వు మీవాళ్ళనందర్నీ బాల్కనీలోకే రమ్మను. యిక్కడైతే పిల్లాడికి యిబ్బంది. వాళ్లు రాకపోతే మాకు నిద్రొచ్చేటట్లుంది. మేమంతా కుర్చీలు తిప్పుకుని బాల్కనీకేసి తిరుగుతాం..." అన్నాడు హరనాథ్ కాళిదాసుతో.

"మరేం పర్వాలేదులే బాబాయ్ ! మా వాళ్ళకు మూకాభినయం గూడా వచ్చు. యిప్పుడు చూసుకో తమాషా...." అంటూ కాళిదాసు బాల్కనీలో కెళ్ళి కూచున్నాడు.

కాస్సేపటి తర్వాత తిరిగి చూస్తే శ్రీనాథ్ గడపదగ్గర తొంగిచూస్తూ కనిపించాడు. తండ్రి వురిమి చూడగానే లోపలికి గెంతి తలుపేసుకున్నాడు.

తూర్పున చీకటి పలచబడ్డాక కాళిదాసు బాల్కనీలోనే చాపలు పరిచేశాడు. మిత్రులతో బాటూ అక్కడే పడుకుని నిద్రను ఆహ్వానించాడు.

శ్రీనాథ్‌నులేపి, కడిగి, కొత్త మెరుపులొచ్చేలా తోమి, హాల్ టికెట్ తోడుబెట్టి యుద్ధరంగంలో దించి వచ్చాడు హరనాథ్....

ముఖంపైకి మంచినీళ్లు చిలకరించుకుంటూ "యెక్కడికెళ్ళిందీ ఆటానా ? చంటిది చంకలో లేకపోతే యేవీ తోచడం లేదు" అంది నిఖిత లాప్‌టాప్ దగ్గరికి అయిష్టంగా నడుస్తూ...

"యెన్ని గమ్యాలు గడచాక తెలిసింది, తెలియని గమ్యాలు తలుపులు తడుతున్నాయని" అంటూ రంగనాథ్ తన లాప్‌టాప్‌కు కొత్త పాఠం నేర్పసాగాడు.

శ్రీ కృష్ణుడి కోసం వెతుక్కుంటూ వెళ్ళిన సత్యభామ యిటు వస్తుందేమోనని యెదురుచూస్తూ శ్యామల గడప దగ్గరే నిలబడిపోయింది.

యింటిచుట్టూ యింతవరకూ అపరిచితులు గానే వుండిపోయిన రంగులనంతా పేరుపేరునా పిలవసాగాడు హరనాథ్.

యుద్ధం నుంచి వచ్చిన శ్రీనాథ్ "రాత్రి పెదనాన్న మధురవాణితో మాట్లాడుతుండడం దొంగతనంగా విన్నానా? అప్పుడు సరిగ్గానా మేజాలో దాక్కున్న పుస్తకమొకటి తనంతట తానే వచ్చి నన్ను లాక్కెళ్లింది. అంతవరకూ దాన్ని గమనించనే లేదు నేను..యీసారి పరీక్ష నన్ను నూరుశాతం నమ్మే సింది...." అన్నాడు హుషారుగా.

అప్పుడే హడావుడిగా యింట్లో కొచ్చిన కాళిదాసు అయిదుగురి ముఖాల్లోనూ తొలిసారిగా వెలుగుతున్న నవ్వుల్ని ఆప్యాయంగా పలకరించాక "నా రైలుమళ్లీ బయల్దేరుతోంది, రేపటికంతా ధార్వాడ్ చేరాలి... మీకు చెప్పేసి వెళ్దామని వచ్చాను. సెలవ్" అన్నాడు.

"నువ్వుంటే శ్రీనాథ్‌కు నూరుశాతం దొరుకు తోంది. యింకో రోజు వుండరాదా? రేపు గూడా వుంది యుద్ధం...." అని హరనాథ్ ప్రాధేయపడ్డాడు.

"వుందామనే వుంది గానీ, యీ సంచిలో వున్న రాలుగాయిలు మొరాయిస్తున్నాయి. మళ్ళీ యీ వూరొచ్చే పని బడకనే పోతుందా ? అప్పుడు తప్పకుండా వస్తాను" అన్నాడు కాళిదాసు నిరాకారపు సంచిని ప్రేమగా తడుముతూ.

"పోనీ ఆటానానూ, సత్యభామనూ, రాగాల రంగుల్నీ మరికొన్ని రోజులు మా దగ్గర విడిచి వెళ్లు" అంది శ్యామల వినయంగా.

"దాందేం భాగ్యం ! వుంచుకోండి. అయినా మీతో వున్నంత మాత్రాన వాళ్లు నన్ను విడిచిపెడతారా యేమైనానా? మీ లాప్‌టాప్‌తో ఆడుకోవాలని వాటికీ వుంది. వాళ్ళకోసమైనా నేనూ వో లాప్‌టాప్‌ను తీసుకొచ్చి, వాళ్ళ ఆటలన్నీ నేర్పిస్తాను.... తమ్ముడు చెప్పినట్టుగా వాళ్ళ కోసమనైనా నేను కొన్ని కష్టాల్ని కొని తెచ్చుకుంటాను. గాయాల్ని చేసుకున్నాకే గదా వెదురు కొమ్మకు పాటలు పుట్టాయి ?.... నేనూ... కొంతైనా..... నా కంతగా పట్టుబడకపోతే నేర్చు కోవడం కోసం మీయింటికే వస్తాన్లెండి... " అంటూ కాళిదాసు నిరాకారపు సంచిని తగిలించుకుని యెగిరిపోయాడు.

యిందాక కాళిదాసుతో బాటూ యింటి లోపలి కొచ్చిన పంతువరాలి బాల్కనీలోంచీ నిక్కి బయటికి చూస్తూ కనిపించింది.

"చంటిపిల్ల పడిపోతుంది. వెళ్ళిపట్టుకోరా శ్రీనాథ్..." అంటూ నలుగురూ వొకేసారిగా పైకి లేచారు.

# హైకూలు

## జి. వెంకటకృష్ణ

వీచెనుగాలి
వూగెను తరువులు
పూల ప్రవాహం

రాలిన చినుకు
గర్భంలో దాచుకుంది
మట్టి వాసన.

పాప 'మొహా'న
మెరిసిపోతున్న 'జంట'
ప్రేమా వాత్సల్యం.

వాన వెలిసింది
వెలుగు కురిసింది
ఇక చెట్ల వంతు

తెల్లవారింది
చీకటితో వెళ్ళింది
వొంటి బద్ధకం

"మోహా"మున
గింగుర్లు కొట్టు తుమ్మెద
కంటిపూలకై

మనో పచ్చికన
గుచ్చే ప్రశ్నల పోచలు
చింతా కాంతం.

కుహూ కుహూ కు....
పసి గొంతుల ప్రతిధ్వని
కోకిల కేళీ.